సాక్షి ఖమ్మం

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



ఔను.. వారు విజేతలు!

ఏపీకి చెందిన పలువురు నాన్ లోకల్ కోటాలో ఇక్కడ.. స్థానిక కోటాలో ఆ రాష్ట్రంలో కూడా టీచర్ ఉద్యోగాలు సాధించారు. 8లో



'రెవెన్యూ'లో ఉలికిపాటు

తల్లాడ తహసీల్దార్ సహా ముగ్గురు ఏసీబీకి పట్టుబడడంతో రెవెన్యూ శాఖ ఉద్యోగుల్లో ఉలికిపాటు మొదలైంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 24°

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మిగతా చోట్ల సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు మేలు



పోస్టర్ వద్ద జిల్లా జడ్జి రాజగోపాల్, తదితరులు

ఖమ్మంలీగల్: మధ్యవర్తిత్వం వల్ల అనేక లాభాలు ఉన్నందున కక్షిదారులు ఉపయోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో మధ్యవర్తిత్వంతో లాభాలపై అవగాహన కల్పించేలా ఏర్పాటుచేసిన పోస్టర్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మధ్యవర్తిత్వంతో కేసు రాజీ పడకుంటే మళ్లీ కోర్టుకు వెళ్లవచ్చని తెలిపారు. ఎలాంటి ఖర్చు ఉండకపోగా, చర్చలు గోప్యంగా ఉంటాయని చెప్పారు. నాలుగు దశల్లో మధ్యవర్తిత్వ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వాణిజ్య వివాదాలు, కుటుంబ కలహాలు, చెక్‌బౌన్స్, ప్రమాద కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉన్నందున న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా జడ్జి సూచించారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



వరి క్షేత్ర ప్రదర్శనలో డీన్, శాస్త్రవేత్తలు, రైతులు

తల్లాడ: రైతులు పంటల సాగు సమయాన నాణ్యమైన విత్తనాలను ఎంచుకుంటూనే అధిక దిగుబడులు సాధించొచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంతకుమార్ అన్నారు. తల్లాడ మండలం నూతనకల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా పంపిణీ చేసిన డబ్ల్యూజీఎల్ 44, సిద్ధి విత్తనాలతో సాగు చేసిన వరి క్షేత్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అధిక దిగుబడి కోసం విత్తనాలు అందుబాటులో ఉన్నందున వినియోగించుకుంటే మేలైన యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని తెలిపారు. తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందొచ్చని చెప్పారు. అలాగే, వరిలో ఆశిస్తున్న బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు నివారణకు ప్లాంటో మైసిన్ 40 గ్రాములను పిచికారీ చేయడమే కాక తాత్కాలికంగా నత్రజని సంబంధిత ఎరువులు ఆపాలని సూచించారు. శాస్త్రవేత్తలు కె.రవికుమార్, డాక్టర్ శిరీష, ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఏఈఓ త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

'రోజ్‌గార్ యోజన'ను వినియోగించుకోవాలి

ఖమంగాంధీచౌక్/ఖమ్మం సహకారనగర్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన(పీఎంవీబీఆర్‌వై) పథకాన్ని అవసరమైన ఉద్యోగులు, యాజమాన్యాలు వినియోగించుకోవాలని వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడీ.శ్రీనివాస్ సూచించారు. ఉపాధి అవకాశాల పెంపు, యువతలో ఉపాధి సామర్థ్యాల అభివృద్ధి, సామాజిక భద్రతను మెరుగుపర్చడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ఈ పథకం కింద కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి నెల వేతనం(గరిష్టంగా రూ. 15వేలు), రెండు విడతలుగా ఖాతాల్లో జమ చేస్తారని, తయారీ రంగం యజమానులకు ప్రతీ ఉద్యోగిపై నెలకు రూ.3వేల ప్రోత్సాహకం అందుతుందని తెలిపారు. అయితే, యజమానులు ఎంప్లాయర్ పోర్టల్‌లోని పీఎంవీబీఆర్‌వై లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు వరంగల్‌లోని పీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

పాలేరులో సీసీ రోడ్లకు రూ.20కోట్లు

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి చొరవతో నిధులు మంజూరు కాగా, మట్టి రహదారులు ఇకపై సీసీ రోడ్లుగా మారనున్నాయి. నియోజకవర్గంలో 614 రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంత్రి శ్రీనివాసరెడ్డి సూచనలతో 126 జీపీల్లో 571 పనులకు రూ.18.32 కోట్లు, ఎంపీ రఘురాంరెడ్డి సూచనల మేరకు 11గ్రామపంచాయతీల్లో 43 పనులకు రూ.1.68 కోట్లు కేటాయించారు. ఇందులో ఖమ్మం రూరల్ మండలంలో 132, కూసుమంచిలో 183, నేలకొండపల్లి మండలంలో 130, తిరుమలాయపాలెం మండలంలో 169 రహదారుల నిర్మాణానికి కలెక్టర్ అనుదీప్ గురువారం పొసీడింగ్స్ జారీ చేశారు.



బోనకల్ మండలం లక్ష్మీపురంలో పట్టా భూమి నుంచి మట్టి తరలిస్తున్న దృశ్యం

మాకెవరూ అడ్డు లేరు..

జిల్లాలో మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. దందాను అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఫిర్యాదు అందితేనే కదులుతాం అన్నట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక, మట్టిని ప్రభుత్వ అవసరాల పేరిట, తాత్కాలిక అనుమతుల మాటున తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలకు రెండు క్వారీలకే అనుమతి ఉండగా, చాలా ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇక ఇసుకను తాత్కాలిక అనుమతుల పేరుతో లెక్కకు మించి రవాణా చేస్తుండడం గమనార్హం.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంఅర్బన్

జిల్లాలో యథేచ్ఛగా ఇసుక, మట్టి రవాణా

- తాత్కాలిక అనుమతుల మాటున దందా
- ప్రభుత్వ పనుల పేరుతో ప్రైవేట్ వెంచర్లకు తరలింపు
- ఫిర్యాదు అందితేనే అధికారుల తనిఖీలు.. ఆపై జరిమానాతో సరి

అవసరాలే అదనుగా..

జిల్లాలోని నగరాలు, మండల కేంద్రాల్లో నిర్మాణాలు నానాటికీ పెరుగుతున్నాయి. వీటికి తోడు రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి, ఇసుక అవసరమవుతోంది. ఇదే అదనుగా కొందరు దందాకు తెరలేపారు. వాగులు తదితర వనరుల నుంచి ఇసుక, గుట్టలు, ఇతర ప్రాంతాల నుంచి మట్టి తవ్వి రవాణా చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ధర నిర్ణయించి సొమ్ము చేసుకుంటుండగా గ్రామాల్లో లోడ్లతో వాహనాలు కళ్లముందే తిరుగుతున్నా అధికారులు పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతుల పేరిట..

పలు ప్రాంతాల్లో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మట్టి తవ్వకానికి ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు ప్రాంతాల్లోనే పర్మిట్లు ఉన్నాయి. అలాగే, రాష్ట్ర, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, జలవనరుల శాఖ పరిధిలో పనుల కోసం 61 ప్రాంతాల్లో తాత్కాలిక అనుమతులు జారీ చేశారు. ఈ ప్రాంతాల నుంచే మట్టి తరలించాల్సి ఉండగా ప్రైవేట్ కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక ఇసుక అధికారిక క్వారీలు లేకున్నా తహసీల్దార్ల నుంచి కూపన్లు తీసుకుని పరిమితికి మించి రవాణా చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎప్పుడైనా ఫిర్యాదు అందితేనే అధికారులు హడావుడి చేసి ఆతర్వాత అటువైపుగా చూడకపోవడం అక్రమార్కులకు కలిసొస్తోంది.

చదును చేస్తామంటూ...

బోనకల్ మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో 60ఎకరాల పట్టా భూమిలో గుట్టలు ఉన్నాయి. గోవిందాపురం రెవెన్యూలో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ రెండు చోట్ల నుంచి ఎర్ర మట్టి తోలకానికి అనుమతి లేకపోగా.. భూమి చదును చేస్తామంటూ దందాకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ అవసరాల పేరుతో నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో ప్రైవేట్ అవసరాలకు మట్టిని తరలిస్తున్నారు. గోవిందాపురం(ఎల్)లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం జరుగుతుండగా, ఆ పేరుతోనూ మట్టి తరలింపు కొనసాగుతోంది. స్థానిక అధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేక స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో గత రెండు, మూడు రోజులుగా తనిఖీ చేస్తుండగా టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం డిపోలు

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతీ నియోజకవర్గంలో ఇసుక డిపోలను తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఖమ్మం, కామేపల్లి, సత్తుపల్లి, కూసుమంచి, మధిర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనుండగా, ఖమ్మం, కూసుమంచి, మధిరలో ప్రారంభమయ్యాయి. త్వరలోనే కామేపల్లి, సత్తుపల్లిలో కూడా డిపోల ద్వారా ఇసుక పంపిణీ మొదలవుతుందని హౌసింగ్ పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. అయినా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమార్కులు అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు.

కరిగిపోతున్న గుట్టలు

పలు మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో తవ్వకాలతో 30 – 40 అడుగుల ఎత్తుతో ఉండే గుట్టలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అక్రమ తవ్వకాలపై స్థానికులు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎర్రుపాలెం మండలంలో తవ్వకాలపై ఫిర్యాదు చేశాక అధికారుల్లో కదలిక వచ్చింది. ఈక్రమంలోనే బోనకల్, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, ముదిగొండ తదితర మండలాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నారు.

తనిఖీలు.. జరిమానాలు



ఇసుక, మట్టి తరలింపుపై నిఘా వేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1,288 వాహనాలు తనిఖీ చేశాం. ఇందులో 211 వాహనాల్లో ఇసుక, 109 వాహనాల్లో ఇతరత్రా తరలిస్తున్నట్లు గుర్తించి రూ.43.69లక్షల జరిమానా విధించాం. గత ఐదు నెలల కాలంలో 340 కేసులు నమోదు చేసి రూ.1,71,73,000 పెనాల్టీ వసూలు చేశాం.

– సాయినాథ్, ఏడీ, మైనింగ్‌శాఖ

నిరంతర కృషితోనే మెరుగైన ఫలితాలు

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్



సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు నిరంతరం శ్రద్ధగా చదువుతూ భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారిస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం రాపర్తినగర్‌లోని టీజీఎంఆర్‌జేసీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కాలేజీలో లైబ్రరీ, పాఠ్యపుస్తకాలు, తరగతి గదులను పరిశీలించాక విద్యార్థినుల తల్లిదండ్రులకు ఇక్కడి సౌకర్యాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ కీలక దశ అయినందున శ్రద్ధగా చదవాలని తెలిపారు. ఇంటర్‌లో రాణించడంతోనే తనకు బిట్స్ పిలానీలో సీటు వచ్చిందని, ఆతర్వాత సివిల్స్ రాశానని చెప్పారు. డిగ్రీతో పాటు ప్రొఫెషనల్ కోర్సుల్లో సీటు రావడానికి ఇంటర్‌లో అడుగులు పడతాయని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా నీట్, జేఈఈ పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పించనున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయానికి దగ్గరి దారులు ఉండవనే విషయాన్ని గుర్తించి కష్టాన్నే నమ్ముకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆర్ఎల్‌సీ అరుణకుమారి, ప్రిన్సిపాల్ చుండు అఖిల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటా చందా.. కోతులకు బందీఖానా!



బోనులో ఉంచిన కోతులు

కామేపల్లి మండలం ఊట్కూర్ వాసులను కొద్దినెలలుగా కోతుల బెడద వేధిస్తోంది. పలుమార్లు చిన్నారులు, వృద్ధులను గాయపర్చడమే కాక ఇళ్లలోకి చొరబడి సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి. అంతే కాక పంట పొలాలపై దాడి చేస్తుండడంతో రైతులకు నష్టం మిగులుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక గ్రామస్తులంతా ఏకమై ఇంటికి రూ.500 నుంచి రూ.వేయి వరకు వసూలు చేశారు. ఆపై కోతులు పట్టేవారిని సంప్రదించి ఒక్కో కోతికి రూ.250 చొప్పున చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో కోతులు పట్టే బృందం సభ్యుడు బాలరాజు ఆధ్వర్యాన గురువారం ఒకేరోజు 400 కోతులను బంధించారు. వీటిని ఇనుప బోనులో ఉంచి ఆహారం సమకూర్చడంతో పాటు రాత్రి సమయాన అటవీ ప్రాంతంలో వదిలేశారు. దీంతో కోతుల బెడద తప్పినట్లయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – కామేపల్లి

కోర్టును ఆశ్రయించిన సొసైటీల పాలకవర్గాలు

ఖమ్మంవ్యవసాయం: గతనెల 14న పీఏసీఎస్‌ల పదవీకాలం ముగియగా, కొన్నింటిని ఆరు నెలల పాటు పొడిగించిన ప్రభుత్వం ఇంకొన్ని పాలకవర్గాలను మాత్రం రద్దు చేసింది. అవినీతి ఆరోపణలు, నిర్వహణ లోపాలతో ఈ నిర్ణయం తీసుకుని పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈక్రమంలోనే జిల్లాలోని ఏదులాపురం, చేగొమ్మ, నేలకొండపల్లి, తల్లాడ, కల్లూరు, పోచారం పాలకవర్గాలను రద్దు చేయగా, ఆయా పీఏసీఎస్‌ల చైర్మన్ల నాయకత్వాన హైకోర్టును ఆశ్రయించారు. మిగతా వారిలాగే తమను సైతం కొనసాగించాలని కోరుతూ పిటీషన్ దాఖలు చేశారు. జిల్లాతో పాటు నల్లగొండ, మెదక్, వరంగల్, మహబూబాబాద్ తదితర జిల్లాల్లోనూ రద్దయిన పాలకవర్గాల బాధ్యులు కోర్టును ఆశ్రయించగా, స్టే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా రామానుజం



రామానుజం

ఖమ్మంక్రైం: ఖమ్మం అడిషనల్ డీసీపీ(అడ్మిన్‌గా) బి.రామానుజం నియమితులయ్యారు. ఈ స్థానాన గతంలో పనిచేసిన నరేష్‌కుమార్ బదిలీ అయ్యాక కొద్దినెలలుగా పోస్టు ఖాళీగా ఉంది. ఈనేపథ్యాన రామానుజంను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. 1991వ ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి జిల్లాలో ఎస్ఐ, సీఐ, డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ డీఎస్పీగా పనిచేస్తుండగా ఏఎస్పీగా పదోన్నతి కల్పించి ఖమ్మం బదిలీ చేశారు.

2,343 మెట్రిక్ టన్నుల యూరియా

- నేడు మరో 3వేల మెట్రిక్ టన్నులు..

ఖమ్మంవ్యవసాయం: జిల్లాకు యూరియా సరఫరా కొనసాగుతోంది. చింతకాని మండలం పందిళ్లపల్లిలోని రేక్ పాయింట్‌కు గురువారం 2,343 మెట్రిక్ టన్నుల ఎన్ఎఫ్ఎల్ కంపెనీ యూరియా చేరింది. ఇందులో 1,073 మెట్రిక్ టన్నులు ఖమ్మం జిల్లాకు, 470 మెట్రిక్ టన్నులు భద్రాద్రి జిల్లాకు, 600 మెట్రిక్ టన్నులను మహబూబాబాద్ జిల్లాకు చేరవేశారు. మిగిలిన 200 మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్‌గా నిల్వ చేశారు. ఇక శుక్రవారం మరో 3వేల మెట్రిక్ టన్నుల క్రిబ్–కో యూరియా చేరనుండగా, మూడు జిల్లాలకు 1,500, 300, వేయి మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇందులో మిగిలే 200 మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్‌గా గోదాంల్లో భద్రపరుస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



తిరుమలాయపాలెం : మేడిదపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

- ప్రతీ సోమవారం లబ్ధిదారుల్లో ఖాతాల్లోకి నగదు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు దశల వారీగా మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని మేకలతండా, మేడిదపల్లి, తిమ్మక్కపేట, సుబ్లేడు గ్రామాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన గురువారం రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలే కేంద్రంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేస్తే, తాము మాత్రం అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తూ ప్రతీ సోమవారం నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. కాగా, సుబ్లేడులో ఇటీవల మృతి చెందిన యూటీఎఫ్ ఉమ్మడి ఏపీ కోశాధికారి, సీపీఎం నాయకుడు జియావుద్దీన్ సంస్మరణ సభలో మంత్రి పొంగులేటి పాల్గొని నివాళులర్పించారు.

పేదల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

కూసుమంచి: రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పేదల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసమంచి మండలంలోని పలు గ్రామాల్లో సీసీ, బీటీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇది కాక అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో ఎన్నికల నాటి హామీలు నెరవేరుస్తున్నామని వెల్లడించారు. కాగా, రెవెన్యూ శాఖలో జీపీఓలుగా నియమితులైన వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పు చేయవద్దని, అలా జరిగితే ఉద్యోగం పోతుందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. కొత్తగా నియమితులైన జీపీఓలు మంత్రిని కలవగా ఆయన మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా తాము తీరుస్తామని తెలిపారు. కానీ తప్పు చేసి రెవెన్యూ శాఖకు మచ్చ తీసుకురావొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆర్అండ్‌బీ, పీఆర్ ఎస్ఈలు యాకోబు, జి.వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, డీఎల్‌పీఓ రాంబాబు, తహసీల్దార్లు విల్సన్, రవికుమార్, ఎంపీడీఓలు సిలార్ సాహెబ్, రాంచందర్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పనికొచ్చే మొక్కలు పెంచండి..

- సత్తుపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మీటింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి, కలెక్టర్ అనుదీప్

సత్తుపల్లి: అటవీశాఖ అధికారులు అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకొని పనికొచ్చే మొక్కలను పెంచాలని.. ఈ క్రమాన జామాయిల్ మొక్కల స్థానంలో వెదురు మొక్కలను నాటాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో మానవీయ కోణంతో వ్యవహరించాలని తెలిపారు. సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్కులో చైన్‌లింక్ ఫెన్సింగ్, సఫారీ బ్యాటరీ వాహనాలు, టింబర్ డిపోలో మీటింగ్‌హాల్, పరేడ్ మైదానాన్ని గురువారం ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో పట్టాలు ఇచ్చామని, పంటలు పండించుకుని ఫలసాయం పొందేందుకు ఆ భూములు వినియోగించుకోవాలని తెలిపారు. కాగా, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు అటవీశాఖ అటంకం కల్పించొద్దని సూచించిన ఆయన... పులిగుండాల ప్రాజెక్టుకు ఎన్నో అభ్యంతరాలు చెప్పినా, ఇప్పుడు అక్కడే ఎకో టూరిజం ప్రాజెక్టు సిద్ధమైందని చెప్పారు. రహదారులు, పంట కాల్వలకు అవసరమైన భూములను అటవీశాఖ నుంచి తీసుకుంటున్నప్పటికీ, ఎకరం కూడా అడవి ఆక్రమణ జరగకుండా చూసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఆయిల్‌పామ్ టన్ను రూ.20వేలు

ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలు టన్ను ధర రూ.19,400 ఉండగా, ఈ నెలాఖరుకల్లా రూ.20వేలు వచ్చేలా చూస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వచ్చే ఏడాది జూన్‌కల్లా యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి వేశ్యాకాంత చెరువును గోదావరి జలాలతో నింపుతామని చెప్పారు. కాగా, మాజీ సీఎం జలగం వెంగళరావును చూసి రాజకీయాల్లోకి వచ్చిన తాను ఆయన చేయలేని బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ, వేంసూరు ఎత్తిపోతల పథకాలు తీసుకొచ్చానని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం తనకు రాజకీయ జన్మనిచ్చినందున, ఎమ్మెల్యే, ఎంపీ ఎవరు ఉన్నా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకొస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్, అటవీశాఖ సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్, భాగం నీరజాదేవి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తోట సుజలరాణి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమల్లోకి రాగానే ఎన్నికలు

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీతక్క

వైరా: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ బిల్లు అమలుకాగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వైరాకు గురువారం వచ్చిన ఆమె రాజశేఖర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు దక్కేలా బిల్లు అమలుకు కేంద్రం సహకరించాలని కోరారు. కాగా, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా పేరుతో విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని తెలిసినా, రైతులను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమను తప్పు పడుతున్నారని పేర్కొన్నారు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని, రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చెరుకూరి కిరణ్, శీలం వెంకటనర్సిరెడ్డి, సూర్యదేవర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కొత్త చీరలు!



టీచర్లకు ఇస్తున్న చీరలు

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కొత్త యూనిఫామ్ వచ్చింది. రాష్ట్రమంతటా తొలిసారి పచ్చరంగులో జరీ అంచుతో టీచర్లకు, నీలిరంగు జరీ అంచుతో ఆయాలకు చీరలు కేటాయించారు. జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 1,720 టీచర్లు, 1,180 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వీరికి ఒక్కో చీర చొప్పున ఇస్తున్నామని జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

20న జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేలా టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లాబోరేటరీస్‌లో ప్రొడక్షన్ ట్రెయినీ ఉద్యోగలకు ఎంపిక ఉంటుందని వెల్లడించారు. ఎంపీసీ, బైపీసీతో ఇంటర్ పూర్తిచేసిన వారు, ఎంఎల్‌టీ, బ్రిడ్జి కోర్సు, ఫార్మా టెక్ 2024–2025లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. 18 – 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, వివరాలకు 91546 79103 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేషన్ దుకాణం సీజ్



స్థానికులతో మాట్లాడుతున్న డీసీఎస్‌ఓ చందన్‌కుమార్

కొణిజర్ల: కొణిజర్ల మండలం సాలెబంజరలోని రేషన్ దుకాణంలో రికార్డులతో పోలిస్తే బియ్యం తక్కువగా ఉండటంతో సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. రేషన్‌షాప్‌లను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. షాప్‌నకు 86.76 క్వింటాళ్ల సన్నబియ్యం కేటాయిస్తే 7.31 క్వింటాళ్లే పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉందని, మిగతా 79.45 క్వింటాళ్లకుగాను క్వింటా మాత్రమే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈమేరకు డీలర్ బాదావత్ బిచ్యాపై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు డీసీఎస్ఓ వెల్లడించారు. డీలర్లు బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ప్రతీనెల బియ్యం సరిగా ఇవ్వకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్తున్నట్లు గ్రామస్తులు ఆయనకు ఫిర్యాదు చేశారు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ఆధ్వర్యాన ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో గురువారం స్త్రీ సంఘాల(ఎస్ఎస్‌జీ) సభ్యులకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న రుణాలు, సబ్సిడీతో మహిళల స్వయం ఉపాధి రంగాల్లో ఎదగాలని సూచించారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం డీసీసీబీ అధికారులు రుణాల మంజూరు, సబ్సిడీలు, చెల్లింపు వివరాలను వివరించారు. బ్యాంకు సీఈఓ ఎన్.వెంకటఆదిత్య, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం పాల్గొన్నారు.

చిన్నారుల గాంధీగిరి!



గ్రామకార్యదర్శికి గులాబీపూలు, వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

తల్లాడ: పాఠశాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు గాంధీ మార్గాన్ని అనుసరించారు. తల్లాడ మండలం మల్లవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యదర్శి షేక్ సిద్దిక్ మియాకు గులాబీపూలు అందించారు. పాఠశాలలో భగీరథ పైప్‌లైన్ లేక తాగునీరు అందడం లేదని, పైప్‌లైన్ నిర్మాణానికి తవ్వి వదిలేయడంతో రోడ్డు పాడైందని పేర్కొన్న వారు పాఠశాలకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తీయించాలని కోరారు. దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్ నిర్వాహకులు డి.అజయ్‌కుమార్, జి.కృష్ణారావు సంఘీభావం తెలపగా సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని కార్యదర్శి తెలిపారు.

బదిలీ స్థానాల్లో చేరుతున్న పీఏసీఎస్‌ల కార్యదర్శులు

ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) కార్యదర్శుల బదిలీల వ్యవహారం తిరిగి తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఆగస్టు చివరి వారంలో కేటగిరీల వారీగా బదిలీలు చేపట్టగా కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో వారిని పాత స్థానాల్లోనే కొనసాగించాలని స్టే ఇచ్చింది. జిల్లాలో 76 పీఏసీఎస్‌లకు 69 సంఘాల కార్యదర్శులను బదిలీ చేయగా, వీరిలో 35 మంది కోర్టును ఆశ్రయించారు. మిగిలిన వారు బదిలీలను సమ్మతించగా.. జిల్లా కమిటీ అనుమతితో 16 మంది నూతన స్థానాల్లో చేరారు. కోర్టుకు వెళ్లిన 35 మందిలో 25మంది కేసు విరమణకు పిటీషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతిస్తే వీరు సైతం బదిలీ స్థానాల్లో చేరనుండగా, కార్యదర్శుల వినతితో కొందరి స్థానాలు మార్చే అవకాశముందని సమాచారం.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.19,107

ఔను.. వారు విజేతలు!

- రెండు రాష్ట్రాల్లోనూ టీచర్ ఉద్యోగాలకు ఎంపిక
- ఇప్పటికే తెలంగాణలో విధులు
- తాజాగా ఏపీలోనూ ఉపాధ్యాయ ఉద్యోగాలు

కష్టపడితే విజయం బానిసగా మారుతుందని నిరూపించారు కొందరు యువతీ, యువకులు. నాన్ లోకల్ కోటాలో తెలంగాణలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ముగ్గురు ఓ పక్క ఉద్యోగం చేస్తూనే ఏపీలో నోటిఫికేషన్ రాగానే సిద్ధమై అక్కడ కూడా ఉద్యోగాలు సాధించడం విశేషం. – మధిర

నాయుడు భవాని

ఏపీలోని కృష్ణా జిల్లా నాగాయలంక మండలం నాగాయలంక గ్రామం భవానీ స్వగ్రామం. ఆమె తండ్రి దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తల్లి వీరలక్ష్మి ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. తెలంగాణ టెట్‌లో 150కి 135, డీఎస్సీలో వందకు 81 మార్కులతో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం మధిర ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఏపీ టెట్‌లో 150కి 143.58, సాధించగా డీఎస్సీలో వందకు 85.19 మార్కులతో ఉద్యోగానికి ఎంపికైంది. ఈసందర్భంగా భవానీ మాట్లాడుతూ తన తల్లితో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించానని తెలిపారు. తన చిన్నతనంలో మూస పద్ధతిలో బోధనతో ఇబ్బంది పడగా, సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకుంటూ సిద్ధమయ్యానని చెప్పారు. ఇదే సమయాన తాను బోధించే పాఠశాలలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు.



పాఠం బోధిస్తున్న నాయుడు భవాని

ఓపెన్ కేటగిరీలో పోటీ

ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించాలన్న కలను నిజం చేసుకునేందుకు తెలంగాణలో ఐదు శాతంగా ఉన్న ఓపెన్ కేటగిరీలో పలువురు ఏపీ వాసులు పోటీపడ్డారు. ఇందులో నాయుడు భవాని, రుద్రపంక్తి సంతోష్ కుమార్, మజ్జిగ త్రినేత్ర ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు గత ఏడాది అక్టోబర్ 10న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకొని మధిర మండలంలో ఎస్‌జీలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయినప్పటికీ సంతృప్తి చెందక... సొంత రాష్ట్రమైన ఏపీలోనూ ఉద్యోగాలు సాధించాలనే తపనతో సిద్ధమై ఇటీవల పరీక్ష రాయగా ఉద్యోగాలు దక్కాయి. దీంతో వీరు ఏపీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా విజయవాడలో ఈనెల 19న వారు నియామక పత్రాలు అందుకోనున్నారు. కాగా, మధిర మండలంలో పనిచేసిన 11 నెలల కాలంలో విద్యార్థుల తల్లిదండ్రుల, సహచర ఉపాధ్యాయుల మన్ననలు పొందారు.

మజ్జిగ త్రినేత్ర



చిత్తూరు జిల్లా గంగవరం మండలం పలమనేరు గ్రామానికి చెందిన త్రినేత్ర తండ్రి మునెప్ప వ్యవసాయం చేస్తుండగా తల్లి సరోజమ్మ గృహిణి. టీజీ టెట్‌లో 123, డీఎస్సీ78.9 మార్కులతో ఉద్యోగం సాధించిన ఆయన రామచంద్రాపురం మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇక ఏపీ టెట్‌లో 141.79, డీఎస్సీ 90.79 మార్కులు సాధించింది. క్రమశిక్షణ, పట్టుదలతో చదవడం ద్వారా ఉద్యోగాలు సాధించానని వెల్లడించారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూస్తూ వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని భావనతో చదవడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు.

రుద్రపంక్తి సంతోష్ కుమార్



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సంతోష్ తండ్రి మల్లేశ్వరరావు ఆ గ్రామ శివాలయంలో పూజారిగా పనిచేస్తుంటారు. తల్లి శైలజ గృహిణి. టీజీ టెట్‌లో 132, డీఎస్సీలో మూడో ర్యాంకు సాధించి మధిర ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఏపీ టెట్‌లో 139, అక్కడి డీఎస్సీలో 85.25 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఆర్థిక సమస్యలను అధిగమించి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో సిద్ధమయ్యానని వెల్లడించారు. హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు షేక్ షావలీ ప్రోత్సహించగా, డీఎస్సీకి అకాడమీ పుస్తకాలు చదువుతూ సొంతంగానే నోట్స్ సిద్ధం చేసుకున్నానని చెప్పారు. దీంతో నాన్ లోకల్ కోటాలో తెలంగాణలో, లోకల్ కోటాలో ఏపీలోనూ ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. మధిర పాఠశాలలో కొద్దికాలమే పనిచేసినా విద్యార్థుల ఉన్నతికి బాధ్యతాయుతంగా వ్యవహరించానని, ఫలితంగా సహచర ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మన్ననలు అందాయని వెల్లడించారు.

అందరిపైనా అమ్మవారి ఆశీస్సులు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్: దుర్గామాత ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఉండాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు. ఖమ్మం 48వ డివిజన్‌లో కార్పొరేటర్ తోట రామారావు, గోవిందమ్మ ఆధ్వర్యాన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించనుండగా విగ్రహాన్ని గురువారం వేదికపైకి చేర్చారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు జరిగే పూజల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పొంగులేటి వ్యాఖ్యలు గర్హనీయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు పొంగులేటి అదే కేటీఆర్‌తో స్నేహం చేశారని, అదే కేటీఆర్ 2023 ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల గాంధీ, తోట రమేష్, తోట లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25లక్షల పోస్టల్ బీమా చెక్కు



బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

వేంసూరు: మండలంలోని అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి పోస్టల్ బీమా ద్వారా మంజూరైన రూ.25లక్షల చెక్కును ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి గురువారం అందజేశారు. గత ఏడాది పాండురంగాచారి రూ.549, రూ.749 ప్రీమియంతో రెండు బీమా పాలసీలు చేశారని ఆయన తెలిపారు. తక్కువ ప్రీమియంతో బీమా పథకాలు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐపీపీబీ మేనేజర్ రాజేష్, సత్తుపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేష్, ఎంఓ రాజాతోపాటు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుపై ఆరోపణలు, ఫిర్యాదులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో టీచర్ల సర్దుబాటు పూర్తయిందని భావిస్తుండగా.. సక్రమంగా జరగలేదని పీఆర్‌టీయూ నాయకులు ఆరోపిస్తున్నారు. అంతేకాక శాస్త్రీయంగా జరగలేదంటూ గురువారం కొందరు ఉపాధ్యాయులు కలెక్టర్ అనుదీప్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా, కొన్ని పాఠశాలల్లో జూనియర్లను కాకుండా సీనియర్లను సర్దుబాటు చేశారని, ఇంకొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించలేదని పీఆర్‌టీయూ ఆరోపించారు. దీనిపై మరోసారి పరిశీలించాలని కోరారు. ఇదిలా ఉండగా ఖమ్మం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడు ప్రత్యేక కేటగిరీలో తనను నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్ చేశారని ఫిర్యాదు చేశారు. ఇంకొందరు ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు కేటాయించడంపైనే అసహనం వ్యక్తమవుతోంది.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని గోకినేపల్లిలో గురువారం ఆమె ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. యంత్రాంగం తరఫున సహకరిస్తుండడమే కాక బిల్లులు దశల వారీగా అందుతున్నందున ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

జ్యూస్ తాగుతూ కుప్పకూలిన యువకుడు

ఆస్పత్రికి తరలించేలోపే మృత్యువాత



ఏకలవ్య (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: జ్యూస్ తాగుతుండగా గుండెపోటు రావడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా పల్లిపాడుకు చెందిన మేడ ఏకలవ్య(30) కొన్నాళ్లు యూకేలో ఉద్యోగం చేశాడు. ఆపై ఉద్యోగం కోల్పోవడంతో ఇబ్రహీంపట్నంలోని తన స్నేహితుడు ఆకాష్‌పటేల్ వద్ద ఉంటున్నాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఆయన జ్యూస్ తాగుతుండగా గుండెపోటుతో రావడంతో పడిపోయాడు. దీంతో పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, గంధసిరి మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. సీఐ ఓ.మురళి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా పెద్దమండవ మున్నేరు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు, గంధసిరి నుంచి ఇసుక తీసుకెళ్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ఈమేరకు వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చింతకాని ఎస్సై, తహసీల్దార్ బదిలీ

చింతకాని: చింతకాని ఎస్సైగా వీరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న నాగుల్ మీరాను హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. ఇక తహసీల్దార్‌గా కల్లూరు డీటీ బాబ్జీప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ అనుదీప్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న కరుణాకర్‌రెడ్డిని కల్లూరు డీటీగా బదిలీ చేశారు. అయితే, ఒకేసారి ఇద్దరు అధికారుల బదిలీకి అక్రమ ఇసుక రవాణా వ్యవహారమే కారణమని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేయడంతో బదిలీ వేటు పడినట్లు సమాచారం.

డబ్బు వసూలు చేస్తున్న నలుగురిపై కేసు

చింతకాని: ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న సయ్యద్ షఫీ, మహ్మద్ అతిక్యూ రెహమాన్, పర్చగాని బుల్లి వెంకయ్య, కిన్నెర సుధాకర్‌పై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. బోనకల్ మండలం రామాపురానికి చెందిన మల్లెల వీరభద్రంకు ఇల్లు మంజూరు కాగా, కూపన్లతో ఈనెల 11న చింతకాని మండలం చిన్నమండవ మున్నేరు రీచ్ వద్దకు వెళ్లాడు. అక్కడ సయ్యద్ షఫీ మున్నేటిలో తనకు పట్టా భూమి ఉందని కంచె ఏర్పాటు చేయగా, అతిక్యూ రెహమాన్, బుల్లి వెంకయ్య, సుధాకర్ ట్రాక్టర్‌కు రూ.వెయ్యి చొప్పున వసూలు చేయడంతో వీరభద్రం ఫిర్యాదు చేశాడు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని సుద్దవాగు తండాకు చెందిన బానోతు శ్రీను(40) కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆయన మోటార్‌సైకిల్‌పై కాకరవాయి నుండి సుద్దవాగుతండా వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి ఇసుక ట్రాక్టరే కారణమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. శ్రీను భార్య ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా పరిధి ఓ వెంచర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో గురువారం టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేశారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ : ముగ్గురికి గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం – వైరా రోడ్డులో వెలుగుమట్ల పార్క్ సమీపాన గురువారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. పార్కు రోడ్డులో నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని వైరా వైపు నుండి ఖమ్మం వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఆపై రోడ్డు వెంట ఉన్న కేఎంసీ బోర్డును కూడా ఢీకొట్టగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అయితే, క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించగా వారి వివరాలు తెలియాల్సి ఉందని ఖమ్మం అర్బన్ సీఐ తెలిపారు.

'రెవెన్యూ'లో ఉలికిపాటు..

- ఏసీబీ దాడులతో కలకలం
- ఇంకా 'జలగ'లు ఉన్నాయని ఆరోపణలు



తల్లాడలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

సత్తుపల్లి: జిల్లాలోని తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) బుధవారం చేసిన తనిఖీలతో రెవెన్యూ శాఖలో కలకలం మొదలైంది. తల్లాడ తహసీల్దార్ వి.సురేష్‌కుమార్, ఆర్ఐ మాలోతు భాస్కర్‌నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ బి.శివాజీరాథోడ్ రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. పని చేయకుండా కొర్రీలు పెట్టడం, డబ్బుల కోసం వేధిస్తుండడంతో ఓ రైతు ఏసీబీని ఆశ్రయించగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలోనూ తల్లాడలోనే తహసీల్దార్ పట్టుబడడం గమనార్హం. అయితే, రెవెన్యూ శాఖలో ఇంకా పలువురు అక్రమార్కులు ఉన్నందున ఏసీబీ అధికారులు దృష్టి సారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అయినా భయం లేదు...

సత్తుపల్లి నియోజకవర్గంలో ఏసీబీ దాడులు జరుగుతున్నా.. కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరు మారకపోవటం చర్చనీయాంశంగా మారింది. 1989లో అప్పటి తల్లాడ తహసీల్దార్ ఏసీబీకి చిక్కారు. 2019 ఫిబ్రవరి 26న తల్లాడ మండలం కలకొడిమ వీఆర్ఓ శ్రీనివాసరావు, అదే ఏడాది మార్చి 27న సత్తుపల్లి మండలం గంగారం వీఆర్వో పద్దం వెంగళరావు, జులై 16న దమ్మపేట నీటిపారుదల శాఖ ఏఈఈ పంది నర్సింహారావు, ఈ ఏడాది జనవరి 27న మున్సిపల్ వార్డు ఆఫీసర్ వినోద్‌ను ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అలాగే, 2019లో జులై 26, 27వ తేదీల్లో వేంసూరు తహసీల్‌లో ఏసీబీ అధికారులు తనిఖీ చేపట్టారు.

ఎకరాకు రూ.10వేల నుంచి..

రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతిపై వరుస ఆరోపణలు వస్తుండడం, ఏసీబీ అధికారులు తనిఖీ చేస్తున్నా తీరు మారడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఏ సర్టిఫికెట్‌కైనా ముక్కుపిండి డబ్బు వసూళ్లు చేస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లే కీలకంగా వ్యవహరిస్తున్నారని, రిజిస్ట్రేషన్లకు వచ్చిన రైతుల నుంచి ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా డబ్బు ఇవ్వకపోతే సాంకేతిక సమస్యల పేరిట పెండింగ్ పెట్టడం ఆనవాయితీగా మారిందని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ భూమి ప్రొహిబిటెడ్ జాబితాలో పడగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు రైతుకు సంబంధించి పత్రాలను ఓ అధికారి కలెక్టరేట్‌కు సమర్పించకపోవడంతో లావాదేవీలు నిలిచిపోయాయని సమాచారం. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మంత్రి పొంగులేటి మందలించినా..

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జులై నెల 17న పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇద్దరు గిర్దావర్ల తీరుతో ఫిర్యాదు చేయడంతో తక్షణమే వారిని బదిలీ చేయాలని ఆదేశించారు. ఇక జులై 25న జిల్లాలోని 27 మంది డిప్యూటీ తహసీల్దార్లు, గిర్దావర్లను బదిలీ చేస్తే సత్తుపల్లి నియోజకవర్గం నుంచే ఐదుగురు ఉండడం చర్చకు దారితీసింది.

వెలవెలబోయిన తహసీల్

తల్లాడ: తల్లాడ తహసీల్దార్ సహా ముగ్గురు ఒకేరోజు ఏసీబీకి పట్టుబడడంతో గురువారం కార్యాలయం వెలవెలబోయింది. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐ భాస్కర్‌నాయక్, భూభారతి ఆపరేటర్ శివాజీ రాథోడ్ బుధవారం ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. ఈ స్థానాల్లో ఎవరినీ నియమించకపోవడంతో కార్యాలయంలో లావాదేవీలేవీ జరగలేదు. గత ఏడాది కాలంగా తల్లాడలో డిప్యూటీ తహసీల్దార్, రెండో ఆర్ఐ కూడా లేరు. ఇప్పుడు ముగ్గురు ఏసీబీకి పట్టుబడడంతో భూభారతి రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా, ఇతర కార్యకలాపాలు కూడా కొనసాగలేదు.

జ్ఞానమే ఆయుధం కావాలి

ఎంపీ, హెటిరో అధినేత పార్థసారధిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న పార్థసారథిరెడ్డి

సత్తుపల్లిరూరల్: విద్యార్థులు జ్ఞానాన్నే ఆయుధంగా చేసుకోవాలని, తద్వారా అదే బలంగా మారి ఉన్నత స్థానాలను చేరుస్తుందని రాజ్యసభ సభ్యుడు, హెటిరో డ్రగ్స్ అధినేత డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి తెలిపారు. సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో కళాశాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేయటం అద్భుతమైన మైలురాయిగా నిలిచేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు. విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద మాట్లాడగా కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, మీరాసాహెబ్, షేక్ యాకూబ్, కొండా రవికుమార్, టి.శేషసాయి, రామకృష్ణ ప్రసాద్, వీరన్న, కృష్ణారెడ్డి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ నాయకుడు జియావుద్దీన్

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన నాయకులు

తిరుమలాయపాలెం: ప్రజా ఉద్యమాలకే కాక ఉపాధ్యాయ ఉద్యమానికి ఎస్.డీ.జియావుద్దీన్ సారథిలా నిలిచారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం నాయకుడు, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు జియావుద్దీన్ సంస్మరణ సభ మండలంలోని సుబ్లేడులో గురువారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. జీవితకాలం గిరిపుత్రుల అభివృద్ధి కోసం తపించడమే కాక ఉద్యోగ విరమణ తర్వాత సీపీఎంలో ప్రజాఉద్యమాలు నిర్మించారని తెలిపారు. ప్రజా సమస్యలను మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశాడని కొనియాడారు. కాగా, కేంద్రప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారం కాపాడుకోడమే కాక రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నందున బీజేపీని గుణపాఠం చెప్పేలా కార్యకర్తలు సిద్ధం కావాలని తమ్మినేని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, బండి రమేష్, షేక్ బషీరుద్దీన్, జియావుద్దీన్ జావీద్‌తో పాటు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీనివాస్, మందుల రాజేంద్రప్రసాద్, గొర్రెపాటి రమేష్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

■ **ఏన్కూర్:** మండలంలోని ఇమామ్‌నగర్‌కు చెందిన బానోతు శ్యామ్‌కుమార్ మృతి చెందగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్, సీపీఎం నాయకులు వేముల కృష్ణప్రసాద్, గుడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● ప్రతిష్ఠాపనకు ప్రతిమలు సిద్ధం



విక్రయానికి సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు



విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతూ...



కోలాటంతో అమ్మవారి విగ్రహానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22న మొదలుకానున్నాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా గతంతో పోలిస్తే ఎక్కువ మంది అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపనకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కోల్‌కతా కళాకారులు అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేయగా.. మండపాల నిర్వాహకులు ముందస్తుగా కొనుగోలు చేస్తున్నారు. కాగా, ఖమ్మం కాల్వొడ్డు వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని వేదిక వద్దకు గురువారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని చేర్చగా మహిళలు కోలాటం ఆడుతూ స్వాగతం పలికారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్